క్లుప్తంగా

నూతన కార్మికుల కార్యవర్గం ఎన్నిక



మాడ్గుల: ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

మాడ్గుల: మాడ్గుల మండలంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య చెప్పారు. కమిటీ అధ్యక్షురాలిగా సాఫియా, కార్యదర్శిగా శ్రీలతలను ఎన్నుకున్నారు. అనంతరం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు స్వప్న, కార్మికులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

తలకొండపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ సాయంతో పోలీసులు కనుగొని బాధితుడికి అందజేశారు. ఆదివారం ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు పట్టణానికి చెందిన మహేశ్ శివరాత్రి సందర్భంగా మల్లప్పగుట్ట శివాలయానికి వెళ్లాడు. అక్కడ జాతరలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. తలకొండపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్ సహకారంతో సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కానిస్టేబుల్ జాషువా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించారు. రికవరీ చేసుకున్నా ఆ మొబైల్‌ను పోగొట్టుకున్న మహేష్‌కు అందజేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనచో సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేసుకోవాలన్నారు.

ఆపదలో ఆదుకోవడమే ట్రస్ట్ లక్ష్యం

ట్రస్ట్ ౖచెర్మన్ దశరథ్‌నాయక్



కడ్తాల్: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ట్రస్ట్ లక్ష్యమని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ౖచెర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన సేనావత్ జామ్లానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి ట్రస్ట్‌నుంచి రూ.5వేలు, స్థానిక ఎంపీటీసీ ప్రియారమేశ్ రూ.3వేలు సాయం చేశారు. మాజీ ఎంపీటీసీ సువాలి, పంతునాయక్, సర్పంచ్ విజయలక్ష్మీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: ఖానాపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ౖచెర్మన్ పాండు రంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ౖచెర్మన్ గురునాథ్‌రెడ్డి, ముత్యాల రాజశేఖర్, మహేశ్, పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటునకు సహకరించాలి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడానికి సహకరించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజక వర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ కోరారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఆదివారం ప్రవీణ్‌కుమార్‌ను పత్యానాయక్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమనగల్లులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటునకు సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసిన మున్సిపల్ వైస్ ౖచెర్ పర్సన్



మల్‌రెడ్డి రాంరెడ్డితో మున్సిపల్ వైస్ ౖచెర్ పర్సన్ మంగ, కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ ౖచెర్ పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన బర్ల మంగజగదీశ్‌యాదవ్ ఆదివారం రాష్ట్ర రోడ్లు భవనాల కార్పొరేషన్ ౖచెర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ అభివృద్ధిపై దృష్టిసారించి పట్టణాభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేయాలని మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆకుల ఆనంద్, కప్పరి చందు, జగదీశ్‌యాదవ్, గాజుల గోపాల్, కౌన్సిలర్లు ఆకుల మమత, జెర్కొని బాలరాజ్ ఉన్నారు.

అసంపూర్తిగా ‘ఇంటిగ్రేటెడ్’ పనులు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్



అర్ధాంతరంగా నిలిపేసిన పనులు

- నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు
- మూడేళ్లు కావస్తున్నా పూర్తికాని పనులు
- జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు
- సత్వరమే పూర్తిచేసి ప్రారంభించాలని వినతి

ఆమనగల్లు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ పనులను ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా నేటికీ పూర్తికాలేదు. ఇది అసంపూర్తిగా ఉన్నప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఆమనగల్లు పట్టణంలో కూరగాయలు, మాంసం, చేపలు విక్రయించడానికి నిర్దిష్ట స్థలాలు లేకపోవడంతో అంగడిబజార్, గాంధీచౌక్ ఇలా పలు చోట్ల విక్రయాలు సాగిస్తున్నారు. రోడ్లపై కూరగాయలు, చేపల విక్రయాలతో అటు విక్రయదారులు, ఇటు కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో కూరగాయల విక్రయం కోసం రైతుబజారు ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో 2021లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీలలో కూరగాయలు, పండ్లు, మాంసం, చేపలు విక్రయం కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీకి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది.

స్థలం ఎంపికపై వివాదం

ఆమనగల్లు పట్టణానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి స్థలం ఎంపిక అప్పట్లో వివాదంగా మారింది. ఇక్కడ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టడానికి అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నిర్ణయించారు. అయితే ఆమనగల్లు మున్సిపాలిటీ పాలకవర్గం మార్కెట్‌యార్డులో కాకుండా పాత బీసీ హాస్టల్ స్థలంలో నిర్మించాలని కోరింది. చివరకు మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్మించడానికి స్థలం కేటాయించారు. 2021, నవంబర్ 8న మార్కెట్ నిర్మాణానికి అప్పటి వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విద్యాశాఖామంత్రి సబితా ఇంద్రారెడ్డి, అప్పటి ఎమ్మెల్యేలు కలిసి శంకుస్థాపన చేశారు. మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ నిర్మాణ పనులు మాత్రం వెంటనే ప్రారంభం కాలేదు. మార్కెట్ నిర్మాణానికి సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టడానికి ముందుకు రాలేదు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులపై తీవ్ర ఒత్తిడి తేవడంతో గతేడాది పనులు ప్రారంభించారు. కొన్ని నెలల పాటు పనులను ముమ్మరంగా చేశారు. రెండు స్లాబులను పూర్తి చేసి ఒకవైపు గోడలు నిర్మించారు. గత ఆరు నెలలుగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు కొనసాగడం లేదు. సంబంధిత కాంట్రాక్టర్‌కు మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన బిల్లులు విడుదల కాకపోవడంతో పనులను నిలిపివేసినట్లు తెలుస్తుంది. అయితే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తులేకలాన్‌లో టీపీఎల్, ఆదిబట్ల మున్సిపాలిటీలోని మంగళ్‌పల్లిలో చిలుక రాములు నిర్వహించిన మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రీమియర్‌లీగ్‌లను ఫైనల్ మ్యాచ్‌కు ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరయ్యారు. తులేకలాన్‌లో టాస్‌వేసి మ్యాచ్ ప్రారంభించారు. మంగళ్‌పల్లిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పోటీ ఉండడం సహజమన్నారు. గెలిచారని పొంగిపోవడం, ఓడారని కుంగిపోవడం చేయొద్దన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ఇలాంటి వేదికలు ప్రతిభను వెలికి తీస్తాయన్నారు. క్రీడాకారుల కోసం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో క్రీడా స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ౖచెర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, గురునాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శివకుమార్, రజినికాంత్‌గౌడ్, పాండురంగారెడ్డి, హరిదాస్‌గౌడ్, చిలుక జయవీర్, తులేకలాన్ నాయకులు కొడూరి రమేష్, శశాంక్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మంగళ్‌పల్లి గేటు వద్ద చలివేంద్రం ప్రారంభించారు.

‘ఆటా’ వేడుకలకు మాజీ సర్పంచ్‌కు ఆహ్వానం

కడ్తాల్: కడ్తాల్ మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డికి ‘ఆటా’ 2024 వేడుకలకు హాజరుకావాలని ఆటా ప్రతినిధులు ఆహ్వానించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అమెరికాలోని తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు 35 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలలో సేవే పరమావధిగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. 2019, 2020 సంవత్సరాలలో ఆటా వేడుకలకు ప్రీమియర్ స్పాన్సర్‌గా వ్యవహరించి, ప్రవాస భారతీయుడు, ఆటా ప్రతినిధి గూడూరు కిశోర్‌రెడ్డి ద్వారా మండల కేంద్రంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఆటా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడంతో అమెరికాలోని జార్జియ నగరంలో జూన్ 7, 9 తేదీలలో జరిగే 18వ తెలుగు యూత్ కన్వెన్షన్‌కు హాజరుకావాలని తనకు ఆహ్వానం అందిందని లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. ఈ వేడుకలకు ఆహ్వానం అందడం చాల సంతోషంగా ఉందన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



పెద్దమ్మతల్లి పూజలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో ఆదివారం పెద్దమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజల్లో భక్తిభావం పెరిగిందని, ఏ గ్రామంలో చూసినా దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ చేస్తున్నారన్నారు. రూ. లక్షల్లో ఖర్చు చేస్తూ అన్ని హంగులతో ఆకట్టుకునే విధంగా దేవాలయాలను నిర్మిస్తున్నారన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వందలాది కొత్త దేవాలయాలు నిర్మితమైనట్లు తెలిపారు. అన్ని దేవాలయాలను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోకి తెచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. పలు గ్రామాల్లో పురాతన దేవాలయాలు ఉన్నాయని, వాటి పునఃనిర్మాణానికి సర్కార్ నుంచి నిధులు మంజురయ్యేలా తనవంతు కృషి చేస్తానన్నారు. శ్రీ పెద్దమ్మతల్లి దీవెనలతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ౖచెర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, కొర్ర అరవింద్‌నాయక్, గిరిమోని భిక్షపతి, అమృతాసాగర్, కేసరిసాగర్, రవీందర్, మచ్చ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ కన్నుమూత



చంద్రయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఖానాపూర్ మాజీ సర్పంచ్ డొంకని చంద్రయ్యగౌడ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. టీడీపీలో ఉన్నప్పుడు మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్ అనుచరుడిగా కొనసాగారు. చంద్రయ్య బౌతికకాయాన్ని సందర్శించి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్, మాజీ జెడ్పీటీసీ పాశం లక్ష్మీపతిగౌడ్, పీఏసీఎస్ ౖచెర్మన్ పాండు రంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ౖచెర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేసి సానుభూతి తెలియజేశారు.

భక్తి భావంతో మెలగాలి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీటీసీ సభ్యులు తదితరులు

తలకొండపల్లి: భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో యాదవులు శనివారం రాత్రి, ఆదివారం గొర్ల పోచమ్మ, చౌడమ్మ తల్లి బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బోనాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు రాజు, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, మాజీ సర్పంచ్‌లు లలిత, జ్యోతయ్య, శంకర్, రవీందర్‌యాదవ్, మల్లేశ్, శేఖర్, మహేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల నిలుపుదల

- పార్కింగ్ సెంటర్‌గా మారిన పాలశీతలీకరణ కేంద్రం
- పట్టించుకోని అధికారులు



వాహనదారులు పార్కింగ్ చేసిన బైక్‌లు, ఆటోలు

కడ్తాల్: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ప్రైవేట్‌వాహనాల పార్కింగ్‌కు సెంటర్‌గా మారింది. శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై గ్రామ ప్రధాన సెంటర్ పాయింట్‌లో పాలశీతలీకరణ కేంద్రం ఉంది. తహసీల్దార్ కార్యాలయం కూడా అక్కడే ఉంది. మండల కేంద్రానికి చెందిన వ్యక్తులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన వ్యక్తులు, తమ వాహనాలను అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. ఆదే విధంగా ప్రతీ నిత్యం హైదరాబాద్, ఆమనగల్లు తదితర ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారితో పాటు, తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వ్యక్తులు కూడా వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో ఇక్కడ పాలశీతలీకరణ కేంద్రం పార్కింగ్‌కు అడ్డగా మారింది. అడిగే వారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నారు. ఇక్కడికి వచ్చే స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్న పట్టించుకునే వారు లేరు. పాలకేంద్రంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పాల కేంద్రంలో ద్విచక్ర వాహనాలతో పాటు, ఆటోలు, కార్లు అడ్డ దిడ్డంగా నిలుపుతుండటంతో పాల కేంద్రంలోకి వచ్చే పాల ట్యాంకర్ల డ్రైవర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పాల కేంద్రానికి ప్రధానంగా వాచ్‌మెన్ లేక పోవడం కూడా సమస్యలకు మరో కారణం. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకుని ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని, పాల ఉత్పత్తి దారులు, స్థానికులు కోరుతున్నారు.

ఈదురు గాలుల బీభత్సం


- విరిగిపడ్డ చెట్ల కొమ్మలు
- నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



ఇబ్రహీంపట్నం: తీగలపై ఒరిగిన స్తంభం



తుర్కయంజాల్: విరిగిన చెట్టు కొమ్మ



ఇబ్రహీంపట్నం రూరల్: నాగన్‌పల్లిలో కూలిన గుడిసె

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ఆదివారం సాయంత్రం గాలి వాన భీభత్సం సృష్టించింది. భారీ స్తంభాలతో గాలి వీచడంతో చెట్లు విరిగిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి, తీగలు తెగిపడ్డాయి. వర్షం మాములుగా కురిసిన ఈదురుగాలులు భయానక వాతావరణాన్ని తలపించింది. హోర్డింగ్‌లో ఉన్న ఫ్లెక్సీలు గాలికి దూడిపోయి విద్యుత్ స్తంభాల తీగలపై పడటంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. బాలికల ప్రాథమిక పాఠశాల లోపల ఉన్న చెట్టు కూలి బయట ఉన్న విద్యుత్‌స్తంభంపై పడిఆటోపై పడింది. సీతారాంపేట ఆర్కెడియా వద్ద విద్యుత్ పోల్స్ వంగిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏడీఏ సైదులు, ఏఈ శ్రీనివాస్‌రావులు వెంటనే సంఘటన స్థలాలను సందర్శించి విద్యుత్ పునరుద్ధరణకు, మరమ్మత్తుల చర్యలు చేపట్టారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలో వడ్డెర కులస్తుల గుడిసెలు కూలీపోయాయి. రేకులు ఎగిరిపోయాయి. గుడిసెలు కూలీపోయిన బాధితులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో మధ్యాహ్నం 3గంటల సమయంలో ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించింది. ఎక్కడికక్కడ చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మాసబ్ చెరువు కట్టపైన పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడటంతో సాగర్ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తాయి. 14చోట్ల విద్యుత్ లైన్లపై పడటంతో సుమారు 3గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది శ్రమించి ఒక్కో ఫీడర్‌ను పునరుద్ధరిస్తున్నట్లు ఏఈ రవివర్మ తెలిపారు. తొర్రూర్‌లో రైతు సంరెడ్డి వెంకట్‌రెడ్డి మామిడి తోటలో కోతకు వచ్చిన కాయలు రాలిపోయాయి.

చురుగ్గా దుకాణ సముదాయం నిర్మాణ పనులు



మార్కెట్‌యార్డులో నిర్మిస్తున్న దుకాణాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న దుకాణ సముదాయం నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నూతనంగా 8 దుకాణాలు నిర్మించడానికి రెండేళ్ల క్రితం రూ.65లక్షలు మంజూరయ్యాయి. దీంతో 2023, ఆగస్టు 18న అప్పటి వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దుకాణ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి మార్కెట్ కమిటీ ౖచెర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి దుకాణ సముదాయ పనులను ప్రారంభించడానికి ప్రయత్నించినప్పటికీ ఎన్నికల కారణంగా పనుల నిర్మాణంలో జాప్యం జరిగింది. కాగా ఇటీవల నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. పనులను ఎప్పటికప్పుడు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీశైలం పర్యవేక్షిస్తున్నారు.